# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!







## 3 గంటల కరెంట్ వద్దు.. 24 గంటల కరెంటే ముద్దు

జఫర్‌గఢ్, నవంబర్ 26 : సీఎం కేసీఆర్ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇవ్వడంతో నాకున్న రెండెకరాల పొలంలో 80 బస్తాలు వడ్లు పండించిన.. వడ్లకు కూడా మంచి ధర ఉన్నది. కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు 3 గంటల కరెంట్ చాలని మాట్లాడడం రైతులపై, వ్యవసాయంపై ఆయనకు అగాహన లేక పోవడమే. 10 హెచ్‌పీల మోటర్లు రైతులకు ఉపయోగంలోకి రావు. అంతేసి ధర పెట్టి 10 హెచ్‌పీ ల మోటర్లు రైతులు కొనలేరు. కాంగ్రెస్ నాయకుల ప్రకటనలను రైతులు నమ్మే స్థితిలో లేరు. తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్నే రైతులందరూ కోరుకుంటున్నరు. నాలాంటి యువ రైతులకు సీఎం కేసీఆర్ వ్యవసాయానికి అందిస్తున్న చేయూత అవసరం. రైతు పక్షపాతి కేసీఆర్‌ను కాదని, రైతువ్యతిరేకి కాంగ్రెస్‌కు ఓట్లేస్తే మళ్లా చీకటి రోజులు వస్తయ్. రైతులందరూ తిరిగి సీఎం కేసీఆర్ సర్కార్‌ను ఎన్నుకుని, వ్యవసాయాన్ని పండుగగా చేసుకుందాం. కాంగ్రెస్ ఇస్తానన్న 3 గంటల కరెంట్ వద్దు. బీఆర్‌ఎస్ ఇస్తామన్న 24 గంటల కరెంటే ముద్దు.

–బజ్జూరి చందర్, తిడుగు, జఫర్‌గఢ్

## కాంగ్రెస్‌ను నమ్మితే కటిక చీకట్లే..



పాలకుర్తి రూరల్, నవంబర్ 26 : కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపిస్తే కారు చీకట్లే.. వాళ్లకు వ్యవసాయం గురించే తెలియదు. కాంగ్రెస్ గెలిస్తే ఎద్దు ఉండదు.. వ్యవసాయం ఉండదు.. మూడు గంటల కరెంట్‌తో వ్యవసాయం సాధ్యమా..? 10హెచ్‌పీ మోటర్ పెడితే బోర్లు ఉంటయా..? ఒక్క దెబ్బకే మోటర్లు కాలుతయి. 10హెచ్‌పీ మోటర్లు కొనాలంటే ఖర్చు ఎక్కువ అవుతుంది. కొత్తగా పైపులు కొనాలే. ఇవన్నీ సాధ్యమా..? రేవంత్‌రెడ్డి మాటలు పిచ్చోడి చేతిలో రాయిలా ఉన్నాయి. 24గంటల నాణ్యమైన కరెంట్‌తో వ్యవసాయం సాఫీగా చేసుకుంటున్నాం. మూడు పంటలు పండుతున్నాయి. బావుల్లో బోర్లలో నీళ్లు సమృద్ధిగా ఉన్నాయి. రైతులను మోసం చేయడానికే కాంగ్రెస్ నాయకులు మూడు గంటల కరెంట్, ఐదు గంటల కరెంట్ అనే మాటలు మాట్లాడుతున్నారు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టి మూడు గంటల కరెంట్ వస్తే మూడు మడులు కూడా పారవు. వరి పంటలు ఎక్కడికక్కడ ఎండిపోతాయి. 10హెచ్‌పీ మోటర్లు వాడితే కరెంట్ బిల్లు ఎక్కువ వస్తుంది. కరెంట్ కష్టాలు మొదలవుతాయి. పట్నంల ఉండే రేవంత్‌రెడ్డికి పల్లెటూరి వ్యవసాయం గురించి ఏం తెలుస్తది. రాజకీయాలు వేరు వ్యవసాయం వేరు. తెలుసుకుని మాట్లాడాలే. సీఎం కేసీఆర్ ఇస్తున్న 24గంటల ఉచిత కరెంట్‌తో రైతులు చల్లగా బతుకుతున్నారు. చెరువుల నిండా నీళ్లు ఉన్నాయి.. చేతి నిండా పని ఉంది.. మూడు పంటలు పండుతున్నాయి. గతంలో చాలీచాలని కరెంట్‌తో బోర్లు మోటర్లు ట్రాన్స్‌ఫార్మర్లు కాలేది. కరెంటోల్ల చుట్టూ తిరిగేది. ఇప్పుడు ఆ బాధ పోయింది. సీఎం కేసీఆర్ చల్లగా ఉండాలే. రేవంత్‌రెడ్డి రైతుల జోలికి వస్తే బాగుండది. ఓటుతో బుద్ధి చెబుతారు.

–చెంచు కర్ణాకర్ రైతు
రాఘవపురం

కాంగ్రెస్ పాలన ఉంటే కరెంటు ఉండదని రైతులే కుండబద్దలు కొడుతున్నారు. ఆ పార్టీకి రైతుల మేలు పట్టదని, మళ్లీ దళారుల రాజ్యం తెచ్చి అన్నదాతలను ఆగంజెయ్యాలని చూస్తున్నరని విమర్శిస్తున్నారు. నాడు కరెంటు ఎప్పుడు వస్తదో? ఎప్పుడు పోతదో తెల్వక పనులన్నీ విడిచిపెట్టి పొలంకాడ ఉండేటోళ్లమని, రాత్రిపూట బిక్కుబిక్కుమనుకుంట కటిక చీకట్ల పొలాల కాడికి పోయేవాళ్లమని, ఇప్పుడా బాధలు లేవని చెబుతున్నారు. కాంగ్రెస్ వాళ్లకు వ్యవసాయాన్ని ఎలా బాగు చేయాలో తెల్వదని, రైతులకు ఏంజేస్తే బాగుంటుందో వాళ్లకు తెల్వదని, ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా రైతు కాబట్టి రైతుల బాధలు తీర్చుతున్నాడని పేర్కొంటున్నారు. తమకు రైతుబంధు, 24గంటల కరెంటు, రైతుబీమా, ఇతర ప్రోత్సాహకాలు ఇస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తమ మద్దతు అంటూ స్పష్టం చేస్తున్నారు. 3గంటల కరెంటు వ్యవసాయానికి ఎట్ల సరిపోతుందో రేవంత్ రెడ్డే ఎవుసం చేసి చూపించాలె అని నిలదీస్తున్నారు. మూడు గంటలే సరిపోతే నాడు కాంగ్రెస్ పాలనలో నాలుగైదు గంటల కరెంటు ఉన్నప్పుడు పొలాలకు నీళ్లు పారినయా అని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి దిక్కూదివానం లేని మాటలు మాట్లాడి రైతులను ఆగంచెయ్యవద్దని, ఇప్పుడిప్పుడే మంచిగవుతున్న ఎవుసాన్ని మళ్లీ ముంచే ప్రయత్నం చేయొద్దని హెచ్చరిస్తున్నారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 26




**రావద్దు మళ్లీ చీకటి రోజులు**

# కాంగ్రెస్ ఉంటే.. కరెంటు ఉండదు

- నాడెవలన్న సచ్చిపోతే స్నానాలకు కూడా కరెంటుండకపోవు..
- మూడు గంటలకు మూడు గుంటలు కూడా పారయ్
- 24 గంటల కరెంటుతోనే మేలు
- ఇప్పడే ఎవుసం మంచిగైంది.. మళ్లీ ముంచొద్దు
- భూముల కొట్లాటలు మళ్లీ తేవద్దు
- హస్తం నేతల మాటలపై రైతుల మండిపాటు
- 'కేసీఆర్‌కే మా సపోర్టు' అంటున్న అన్నదాతలు

## 'ధరణి'తో సమస్యలు తీరినయ్..



పాలకుర్తి, నవంబర్ 26 : ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని భూముల సమస్యలు ధరణితో తీరిపోయాయి. అంతకుముందు బ్యాంకు లోను కావాలంటే పహాణి నకళ్ల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగాల్సి వచ్చేది. ఇప్పుడు దగ్గరలో ఉన్న మీ సేవల్లోనే పహాణీలు వస్తున్నాయి. దీంతో ఎవరి దగ్గరకీ వెళ్లకుండానే క్షణాల్లో 1బీ నకళ్లు తీసుకుంటున్నాం. ధరణి రావడం వల్ల రైతుబంధు, రైతు బీమా వస్తోంది. వాటితో పంటలకు పెట్టుబడి పెట్టుకుని అప్పులు లేకుండా వ్యవసాయం చేస్తున్నాం. రైతుల కోసం ఇంతగా ఆలోచిస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్నే గెలిపిస్తాము.

–నీరటి విమలమ్మ రైతు వల్మిడి పాలకుర్తి

## సమస్య లేకుండా 'రైతుబంధు'



జఫర్‌గఢ్, నవంబర్ 26 : సీఎం కేసీఆర్ సారు ధరణిని ఏర్పాటు చేసిండ్రు. రైతులకు ఇచ్చే పెట్టుబడి సాయం ధరణితోనే వస్తోంది. ధరణితోనే అమాయకులైన రైతుల భూములకు భద్రత ఏర్పడింది. ధరణిని తీసి వేసే కుట్ర కాంగ్రెస్ చేస్తుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని తీసివేస్తామని ప్రచారం చేస్తున్నరు. ధరణితో వ్యవసాయ భూముల అమ్మకాలు, కొనుగోలు వ్యవహారాలు చక్కగా జరుగుతయ్. ధరణి లేక పోతే రైతుల భూములను దళారులు, పైరవీ కారులు ఇష్టారాజ్యంగా తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయిస్తరు. ధరణిని వద్దంటున్న కాంగ్రెస్‌ను రైతులందరం వద్దంటున్నాం. కాంగ్రెస్‌ను ఓడిస్తాం. ధరణికి కాపాడుకుంటాం.

–నల్లమెట్ల సాయిలు,
సాగరం, జఫర్‌గఢ్

## ధరణితో రైతుల జీవితాల్లో వెలుగులు



పాలకుర్తి నవంబర్ 26 : ధరణి తీసుకొచ్చిన తరువాతనే రైతుల జీవితాల్లో వెలుగులు కన్పించాయి. తమ భూములకు ధరణిరక్షణ కవచంగా ఉంది. దీంతో రైతుల గుండెపై చేయి వేసుకొని హాయిగా నిద్రపోగలుగుతున్నారు. సీఎం కేసీఆర్ రైతుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని కష్టాలను తీర్చేందుకు ధరణి పోర్టల్‌కు రూపకల్పన చేశారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలు ఒకే చోట పొందుపరిచి భూముల నిర్వహణ అధికారుల చేతుల్లో నుంచి తీసివేయడంతో రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే కష్టాలు పోయాయి. ధరణితో రైతులు వచ్చి వేలిముద్ర వేస్తేగానీ భూమి పట్టా మార్పిడి జరగని పరిస్థితి తీసుకువచ్చిన కేసీఆర్‌కు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఇది రైతులు ఎంతో సౌకర్యంగా ఉంది. రైతు అనుమతితో మాత్రమే అతని భూమి మరొకరి పేరుతో నమోదవుతుంది. ధరణిని తీసివేస్తే పట్టాదారుల భూములు ఆగమవుతాయి. భూసమస్యలు మళ్లీ తలెత్తుతాయి. దళారుల రాజ్యంతో రైతులకు సమస్యలు వస్తాయి. కాంగ్రెసోళ్ల భూమాత మాకొద్దు. కేసీఆర్ తెచ్చిన ధరణిని కాపాడుకుంటాం. ధరణి ద్వారా రైతు బంధు కూడా నేరుగా రైతు ఖాతాలో వేస్తున్నారు. దీంతో పెట్టుబడికి ఇబ్బందులు లేకుండా పోయాయి. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు. రైతు పక్షపాతి కేసీఆర్. రైతుల గురించి ఆలోచన చేసే ఇలాంటి తెలంగాణ ప్రభుత్వం అవసరం ఉంది.

–ఉరుమడ్ల రాజన్న(రాజిరెడ్డి), రైతు, మల్లంపల్లి, పాలకుర్తి



**తెలంగాణను దేశానికి రోల్ మాడల్‌గా చేసినోళ్లకా?**

**అవినీతి అరాచకాలకు కేరాఫ్‌గా మార్చినోళ్లకా?**

**నీ ఓటు ఎవరికి?**

**తెలంగాణమా తేల్చుకో**

## ఎవుసం పడావు పడ్డట్టే..



బచ్చన్నపేట, నవంబర్ 26 : కాంగ్రెసోళ్లు 3గంటల కరెంటు ఇస్తే ఎవుసం ఇక పడావు పడ్డట్టే. మళ్లీ పాత రోజులు మొదటికి వస్తాయి. కరెంటు కోసం సబ్‌స్టేషన్ల చుట్టూ ముట్టడీలు తప్పవు. రోడ్లెక్కి ధర్నాలు చేసుడు షురువే. గత ప్రభుత్వాల హయాంలో వలస వెళ్లిన అన్నదాతలు కేసీఆర్ సీఎం అయ్యాక చెరువులు నిండి సాగునీరు పుష్కలంగా అందాక మళ్లీ ఊరుబాట పట్టారు. వ్యవసాయం పండుగలా సాగి రైతన్నల బతుకులు బాగుపడ్డయ్. అరవై ఏళ్లు అనుభవించిన కరెంటు కష్టాలు మళ్లీ కావాలా మనకు. మన తెలంగాణలో మన రాజ్యమే ఉండాలే. ఢిల్లీ పెత్తనం మనకెందుకు. స్వరాష్ట్రం సాధించుకున్నం. తెలంగాణోళ్లమే పాలించుకోవాలి. ఇప్పుడిప్పుడే బాగుపడుతున్నం. పుసుక్కున కాంగ్రెస్‌కు ఓటేస్తే రిస్క్ పడ్డట్టే. మనల్ని ఇక ఎవరూ బాగు చేయరు. చాలా బాధ పడాల్సి వస్తుంది. అభివృద్ధి చేసిందెవరు. అండగా నిలుస్తున్నదెవరు ఆలోచన చేయాలి. తెలంగాణ రాకముందు కరెంటు ఎట్లా ఉండే. ఇప్పుడు ఎలా ఉందో చర్చించాలి. పని చేసినోడికే ఓటెయ్యాలి. ఆంధ్రోళ్లను ఆదరించం.. వాళ్లు వద్దు, వాళ్ల పాలన వద్దు. కేసీఆర్ ముద్దు.

– కలకుంట్ల కిష్టయ్య (కొన్నె , బచ్చన్నపేట మండలం)

## 'ధరణి' రద్దు చేస్తే తీవ్ర నష్టం



తరిగొప్పుల, నవంబర్ 26 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను రద్దు చేసి భూమాత పోర్టల్ తీసుకువస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఒకవేళ ధరణిని తీసేస్తే రైతులకు నష్టం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పటేల్ పట్వారీల కాలం నాటి పరిస్థితులు వస్తాయి. ఇప్పుడు రైతులు ధరణి ద్వారా స్వేచ్ఛగా జీవిస్తున్నారు. పొలాలన్నీ భద్రంగా ఉన్నాయని గుండెమీద చెయ్యి వేసుకుని ఉంటున్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఎనుకటి కాలంలాగా అధికారులు, పెత్తందార్లు, దళారుల రాజ్యం వస్తుంది. వాళ్లు ఏం చెబితే అదే జరగాల్సి ఉంటుంది. పాతకాలం నాటిలాగా రెవెన్యూ రికార్డుల్లో అన్ని కాలమ్స్ ఉంటే చాలా నష్టపోతాం. కౌలు రైతులకు కూడా హక్కులు కల్పిస్తే భూములపై పట్టాదారుడికి అన్యాయం జరుగుతుంది. ధరణితో చాలా ఉపయోగకరంగా ఉంది. మళ్లీ కేసీఆర్ సర్కార్ రావాలని రైతులంతా కోరుకుంటున్నారు.

–ముక్కెర రాఘురాజ్‌యాదవ్, రైతు, అంకుషాపూర్

## పావు సేరు తినేటోనికి అద్ద సేరు తినమన్నట్టుంది..

దేవరుప్పుల, నవంబర్ 26 : పావుసేరు అన్నం తినేటోనికి బలవంతంగా అద్ద సేరు అన్నం నోట్లెకుక్కినట్టున్నది రేవంత్‌రెడ్డి మాటలు. మా బోర్లకు 5హెచ్‌పీ మోటర్లు పెట్టుకుని నిమ్మలంగా పొలాలు పారిచ్చుకుంటున్నాం. ఒక్కసారే 10హెచ్‌పీ పెట్టుకోండని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉచిత సలహా ఇవ్వడం అతనికి వ్యవసాయం మీద కనీస జ్ఞానం లేదని బోధపడుతుంది. 10హెచ్‌పీ పెడితే భూమిల నీళ్లుంటయా..? గుంచి పోస్తే నీళ్లు పాతాళానికి పోతయ్. పైన మోటర్ నడిస్తే కింద రైతు బోరు పోయదు. కాంగ్రెస్ వస్తేనే ఇసొంటి తెలివి తక్కువ పనులు, దిక్కుమాలిన ఆలోచనలు వస్తయ్. పదేళ్ల నుంచి రైతులు నిమ్మలంగ ఉన్నరు. పంటలు పండిస్తుండ్రు. కంటినిండ నిద్రపోతుండ్రు. మళ్ల మాయదారి కాంగ్రెసొస్తే మూడు గంటల కరెంటంటుండ్రు. అది గూడ ఏరాత్రొచ్చేది తెల్వదు.. ఏ పగలొచ్చేది తెల్వదు. రైతు ఆగమవుడే తప్ప, పొడుగయేది లేదు. మళ్లమళ్ల కేసీఆర్‌కు ఓటేస్తనే తెలంగాణ రైతాంగం సుఖంగ ఉంటరు. కాంగ్రెస్ వస్తెనే కరెంటు పని ఖతం అని ఊళ్లళ్ల అనుకుంటుండ్రు.



–ఎల్లబోయిన సోమనర్సయ్య,
రైతు, కామారెడ్డిగూడెం



## కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు

కొడకండ్ల, నవంబర్ 25 : ధరణిని రద్దు చేసి మరొకటి తెస్తాం. మూడు గంటలే కరెంటు ఇస్తమంటూ అధికారంలోకి రాకముందే కాంగ్రెసోళ్లు భయపెడుతున్రు. తొమ్మిదేండ్ల సంది వ్యవసాయానికి మంచి కరెంటు వస్తుంది. ధరణి వల్ల రిజిస్ట్రేషన్లు అలుకగా అయితున్నయి. గతంలో ఆర్‌వోఆర్ కోసం పట్వారీలు, కార్యాలయాల చుట్టూ తిరిగే వాళ్లం. ఆర్‌వోఆర్ చేసేందుకు వేలకువేలు డబ్బులు ఖర్చు అయ్యేటివి. ధరణి వచ్చినంక రైతుల భూములకు భద్రత దొరికింది. సీఎం కేసీఆర్ సార్ ధరణిని పెట్టి మంచి పని చేసిన్రు. పొరాటున కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాదు.

–డీ రవి, రైతు, నర్సింగాపురం, కొడకండ్ల

## నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్లు..

రఘునాథపల్లి, నవంబర్ 26 : ఎవరికైనా భూమిని అమ్మినా, కొన్నా ధరణి పోర్టల్ ద్వారా నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ చేస్తున్నరు. వెంటనే భూములకు సంబంధించి పత్రాలను కూడా అధికారులు ఇస్తున్నరు. అలాంటి ధరణిని కాంగ్రెసోళ్లు బంగాళాఖాతంలో పడే సామనడం సరికాదు. పాత పద్ధతి మళ్లీ వస్తే పైరవీకారులు పుట్టుకొస్తాయి. పాస్ బుక్కులో కౌలుదారు పేరు చేర్చి రైతుతో సమానంగా హక్కులు కల్పిస్తామనడం విడ్డూరంగా ఉన్నది. కాంగ్రెస్ పాలనలో పటేల్, పట్వారీ వ్యవస్థలో ఒకరి 'భూమిని మరొకరి పేరున రాసేటోళ్లు. ఆ భూమిని తనపేరున సరిచేసేందుకు రైతుల నుంచి డబ్బులు గుంజేవారు. తెలంగాణ వచ్చిన తర్వాత పాతపద్ధతిని తొలగించి ధరణి ఏర్పాటుతో లంచాలు ఇవ్వకుండానే నిమిషాల్లోనే భూమార్పిడి జరుగుతుంది. అందుకే ఈ ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కే నా మద్దతు.

–ముక్క పరశురాములు మేకలగట్టు రైతు



## ధరణి తీసేస్తే మళ్లీ లొల్లే..



కొడకండ్ల, నవంబర్ 26 : ధరణిని ఎత్తివేస్తామని కాంగ్రెసోళ్లు అంటున్నారు. ధరణి పోతే రైతుల మధ్య లొల్లి మొదలవుతుంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు భూ వివాదాలతో కోర్టులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. అలాంటిది కేసీఆర్ పాలనలో ధరణి పోర్టల్ ద్వారా భూ వివాదాలకు తావులేకుండా చేశారు. కాంగ్రెస్ నాయకుల కళ్లబొల్లి మాటలు వింటే మళ్లీ తగాదాలు మొదలవుతాయి. ధరణిని తీసేస్తే మాలాంటి రైతులం మళ్లీ ఆగమవుతాం. ధరణి వచ్చిన తర్వాతే దళారులు చుట్టూ, తహసీల్ కార్యాలయం చుట్టూ తిరిగే బాధలు తప్పాయి.

– బోయిని రమేశ్, రైతు, కొడకండ్ల